# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ సమగ్ర ప్రగతికి ఈశాన్య ప్రాంత అభివృద్ధి అత్యంత కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ సార్థక్ పీడీఎస్ రేషన్ సరఫరా పథకాన్ని 2031 వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది.
- ❖ కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కెనడా పర్యటనలో భాగంగా టొరంటోలో వ్యాపార వర్గాలతో ఉన్నత స్థాయి సమావేశాలను నిర్వహించారు.
- ❖ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ సమగ్ర ప్రగతికి ఈశాన్య ప్రాంత అభివృద్ధి అత్యంత కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సిక్కిం విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్థానిక భాష, సంస్కృతి, పర్యావరణాన్ని పరిరక్షించే ప్రత్యేక బాధ్యత విశ్వవిద్యాలయంపై ఉందని చెప్పారు. విద్య ద్వారా తమను తాము శక్తివంతులుగా తీర్చిదిద్దుకుని, సమాజం, దేశ శ్రేయస్సు కోసం కృషి చేయాలని విద్యార్థులకు రాష్ట్రపతి పిలుపునిచ్చారు. సిక్కిం తన సహజ సౌందర్యం, సంస్కృతి, జీవవైవిధ్యం కారణంగా ప్రత్యేక గుర్తింపును కలిగి ఉందని అన్నారు. 2016లో సిక్కిం భారతదేశపు మొట్టమొదటి పూర్తి సేంద్రియ రాష్ట్రంగా అవతరించడం గర్వకారణమని రాష్ట్రపతి అన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ రెండూ కలిసి సాగగలవని సిక్కిం నిరూపించిందని ద్రౌపది ముర్ము పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తం కావాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం పోస్ట్ ద్వారా దేశ ప్రజలను కోరారు. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు నీటిని తమ వెంట తీసుకువెళ్లాలని, అలాగే తగినంత నీరు తాగాలని నరేంద్ర మోదీ సూచించారు. ప్రజల రోజువారీ జీవితంలో ఈ అధిక ఉష్ణోగ్రతలు ఇబ్బందులను పెంచుతున్నాయని అన్నారు. మధ్యాహ్నం తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లడం మానుకోవాలని, వీలైనంత ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలని ప్రధాని దిశా నిర్దేశం చేశారు. అదే విధంగా జంతువులు, పక్షులను దృష్టిలో ఉంచుకుని.. ఇళ్ల బయట, పైకప్పులపై, నీటితో నింపిన ఒక చిన్న పాత్రను ఉంచాలని కోరారు. ఈ కష్టకాలంలో ప్రతి ఒక్కరూ ఒకరికొకరు సహకరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో ఈరోజు సమావేశమైన కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. సార్థక్ పీడీఎస్ రేషన్ సరఫరా పథకాన్ని 2031 వరకు కొనసాగించేందుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం కాలంలో ఈ పథకానికి 25 వేల 530 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆహార ధాన్యాల అంతర్రాష్ట్ర రవాణా, నిర్వహణ ఖర్చులు, చౌక దుకాణాల డీలర్ల మార్జిన్ ఖర్చుల భర్తీకి కేంద్ర సహాయ నిబంధనల్లో మార్పులు చేయాలని కూడా ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) నిర్ణయించింది. ఆ వివరాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 9వ తరగతి విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు అభ్యసించాలని సీబీఎస్ఈ ఇటీవల నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి దీనిని అమలు చేయాలని తీర్మానించింది. సీబీఎస్ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఈరోజు అంగీకరించింది. ఈ క్రమంలోనే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం కేంద్రం, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీలకు ఈ అంశంపై నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కెనడా పర్యటనలో భాగంగా రెండవ రోజున టొరంటోలో కెనడాకు చెందిన సీనియర్ వ్యాపార వర్గాలు, పెట్టుబడిదారులతో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, వ్యూహాత్మక రంగాలలో పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ఈ సమావేశాల లక్ష్యమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పర్యటన సందర్భంగా పీయూష్ గోయల్ కెనడా అంతర్జాతీయ వాణిజ్య మంత్రి మణిందర్ సిధును కలిశారు. భారత్, కెనడాల మధ్య పెరుగుతున్న వాణిజ్య సంబంధాల గురించి చర్చించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు విస్తరించడం, ఈ ఏడాది చివరి నాటికి సీఈపీఏ (CEPA) చర్చలను ముగించడం అనే తమ ఉమ్మడి లక్ష్యాన్ని ఇరుపక్షాలు

పునరుద్ధాటించాయని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా టొరంటోలో ఉన్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి కేంద్రమంత్రి మాట్లాడుతూ... వ్యాపారం, సాంకేతికత, విద్యా రంగం, ఆవిష్కరణలు, సామాజిక నాయకత్వం వంటి రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం విలువలను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రవాస భారతీయులు నిలబెడుతున్నారని ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి  ఉన్న అధికారాలను సుప్రీంకోర్టు సమర్థించింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఎస్ఐఆర్ భిన్నంగా ఉన్నంత మాత్రాన దీనిని కొట్టివేయలేమని, ఇది పూర్తిగా రాజ్యాంగబద్ధమైనది, చట్టబద్ధమైనదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950, ఓటర్ల నమోదు నిబంధనలు-1960కి విరుద్ధమనే వాదనను తిరస్కరించింది. ఈ ప్రక్రియ స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలనే రాజ్యాంగ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్ నిర్వహించడం ద్వారా కేంద్ర ఎన్నికల సంఘం తన పరిధి దాటి వ్యవహరించలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ రోజు తీర్పును వెలువరించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఉత్తర మధ్య భారతదేశం అంతటా తీవ్రమైన వడగాలుల పరిస్థితులు కొనసాగుతున్నాయని  భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈరోజు ఉష్ణోగ్రత 43.5 డిగ్రీల సెల్సియస్ గా నమోదు అయిందని పేర్కొంది. రాజస్థాన్‌లోని ఐదు జిల్లాల్లో వడగాలుల పరిస్థితుల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ ఐఎండీ జారీ చేసింది. జోధ్‌పూర్, బికనీర్, కోటా డివిజన్లలోని కొన్ని ప్రాంతాలతో పాటు, షెఖావతి ప్రాంతంలో కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల గురించి ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శక్తికాంత్ మిశ్రా తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన సన్‌రైజర్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన రాజస్థాన్ రాయల్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 151 పరుగులు చేసింది. ఇందులో గెలిచిన జట్టు గుజరాత్ టైటాన్స్‌తో ఈనెల 29న రెండవ క్వాలిఫయర్ లో ఆడుతుంది. ఓడిన జట్టు టోర్నీ నుండి నిష్క్రమిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =